తిరస్కృతి

[కథానిక]

= శ్రీ పినిశెట్టి శ్రీరామమూర్తి =

నారాయణదాసుగారింట్లో ఆ ఒక్కగాని ఒక్క కోడలూ కొడుకైన రమేశుకు ఏమాత్రం నచ్చలేదు. కాని లోకందృష్టిలో కమల అందవికారి కాదు. ముక్కుకన్నుతీరు బాగానే ఉన్నా, రంగుకు ప్రాముఖ్యమిచ్చే రమేశుదృష్టికి ఆమె చామనచాయ ఏమీ తృప్తిగా కనుపించలేదు.

అందులోనూ ఈసంవత్సరం బి. ఏ. పరీక్షకు కూచున్న రమేశుకు—విమర్శించేకొద్దీ—తల్లిదండ్రులు తన కెంతి అపకారం చేశారో అవగాహనకాజొచ్చింది. నీతిశాస్త్రరీత్యా ఆ అపకారానికి ఉపకారం చేయలేదు గాని, మరోవిధంగా అపకారంచేసి వృద్ధులయిన తల్లిదండ్రులను బాధపెట్టే నిర్ణయానికి మాత్రం రాలేదు.

కలకత్తాలో పరీక్షలు అయిపోగానే ఇంటికి చేరుకున్న రమేశు, చిరునవ్వులతో ఎదురుగా వచ్చిన కమలను చూచినమీదట, ఇంటివగ్గర అట్టేకాలాన్ని కృషాచేయకూడ దనుకున్నాడు.

తల్లిదండ్రులు వేసిన కుశలప్రశ్నలకు సమాధానం యిచ్చి, భోజనం చేసినమీదట మేడమీదకు పోయి తన గదిలో కూర్చొని, ఏదోపుస్తకం తెరిచాడు రమేశు.

కమల తన పనులు ముగించి, భర్తయొక్క ప్రశాంతవీక్షణప్రసాదంకోసం మేడమీదకు వెళ్ళింది. పుస్తకం చదువుతోన్న రమేశుకు కమలరాక ఏమీ ఆనందాన్ని ఇవ్వకపోగా, ఏకాంతవాసానికి భంగం కలిగించింది.

కుర్చీమీదనుంచి లేచి, పుస్తకం డ్రాయరుమీద పెట్టి, తెల్లని తుండును పైన వేసుకొంటోన్న రమేశును—

“ఇంత ఎండలో ఎక్కడికీ ప్రయాణం” అని అడిగింది కమల.

రమేశు సమాధానం ఇవ్వలేదు. ఆమెకేసి చూడనే లేదు. బహుశా ఒక అల్పజీవి తన దయాదాన భిక్ష కోసం అఱ్ఱులుచాచి అపేక్షిస్తోం దనే ఆలోచనకూడా అతనికి లేదేమో! చరచరా క్రిందికి దిగివెళ్లిపోయాడు.

తాను క్రితం చేసినదిగాని, ప్రస్తుతం చేస్తోన్నది గాని భర్తపట్ల నేరం ఏమిటో ఆమెకు అర్థం కాలేదు. తన ప్రతినడవడికనూ మనోదృష్టిలో మరోమారు ప్రతిబింబింపజేసుకుంది. ఎవ్వరూకూడా వేలుపెట్టి చూపగల నేరం తానేమీ చేయనట్లుగా నిర్ధారణచేసుకుంది. కాని తాను ఆశించినదానికి ప్రతిఫలంగా తిరస్కృతిశరం ఆమె అమాయకహృదయంలో నాటుకుంది. రెండు అశ్రుకణాలుకూడా ఆమెకళ్ళల్లోంచి క్రింద జారిపడినై.

“కమలా” అని అత్తగారైన మంగతాయి మేడ మెట్లెక్కుతూ పిలిచిన ఆ పిలుపు కమలను ఈలోకంలో పడేటట్లు చేసింది. తొందరగా పయిటచెంగుతో కళ్ళు తుడుచుకుంది. గదిగుమ్మందగ్గరగా వచ్చిన మంగతాయి-

“వా డెక్కడికి పోతున్నది?” అని అడిగింది.

“నాతో వారేమీ చెప్పలేదు.”

“నువ్వేమీ అడగలేదా?”

“అడిగాను...” కమల మొగం పక్కకు తిప్పుకుంది.

కొడుకుయొక్క నడతను మొదట్నుంచీ గమనిస్తోన్న మంగతాయి తన సంశయ నివృత్తికి మరోప్రశ్న

చేయనక్కర్లేకుండానే గ్రహించుకోగలిగింది. నెమ్మదిగా ఆమె క్రిందకు దిగి వెళ్లిపోయింది.

పురుషులయొక్క మనోభావాలపట్ల ఉత్ప్రేక్షలకు స్థానం యిచ్చి 'ఏలాగైనా మగవారు' అనే గౌరవసింహాసనా న్నధిష్ఠింప జేసిన కమలలాంటి స్త్రీలకు ఈలాంటి తిరస్కారశరాలు తాకడం సహజమో; లేక అవమానాలు భరించగలిగిన సహనత్వాన్ని సంపాదించి మంచనే పదార్థానికి వారు అర్హురాండ్రే అవుతారో; తెలుసుకోవడం కష్టం.

ఎన్నో రాత్రుళ్లు మన్మథునికి ఉపవాసం చెప్పి నిగ్రహించుకున్న రమేశుకు ఆరాత్రి గడవడంకూడా గగనం కాలేదు.

తనకు తన తల్లి చెప్పిన విధ్యుక్తధర్మప్రకారం కమల శయనాగారాన్ని ప్రవేశించగనే భర్తపాదాలు ఒత్తడం, వేకువన లేవగానే ఆ పవిత్రపాదాలకు నమస్కరించడం— ఈ రెండుకార్యాలూ నిర్విఘ్నంగా జరగడంలో రమేశం ఏలాంటి అభ్యంతరమూ పెట్టలేదు.

ఉదయాన్నే కమల తులసికోటదగ్గరగా కలాపి చల్లుతోంది. దూరంగా నిలబడ్డ మంగతాయి అయిదు నిమిషాలపాటు కోడలిమొగంకేసి విమర్శనీయంగా చూసిరిది.

ఆమెమొగంలో సహనచ్ఛాయల మధ్యగా విషాదరేఖలుకూడా విస్పష్టంగా కనిపిస్తున్నై.

"కమలా!" కరుణాపూరితదృక్కులతో చూస్తూ పిలిచింది మంగతాయి.

పని పూర్తిఅయినవెంటనే చేతులు శుభ్రంచేసుకొని, అత్తగారిదగ్గరగా వెళ్ళి నిలిచింది కమల.

కోడలిశిరాన్ని ఆప్యాయంగా నిమురుతూ— "ఈనేరం మేము చేసిందే తల్లీ ! నువ్వు ఆంతర్యంలోనైనా వాణ్ని శపించకు" అంది మంగతాయి.

ఆశ్చర్యంగా మంగతాయికేసి చూసింది కమల. ఆమెకళ్లు నీటితో చెమ్మగిల్లాయి.

"వారిని శపించగల శక్తి నాకు లేదండీ. అలాంటి శక్తే నాలో వుంటే, అది సద్వినియోగం చేసుకొని, వార్ని నావారిగా చేసుకునేదాన్నే" కమల యికమించి మాట్లాడలేకపోయింది. అక్కడనుంచి వెళ్లిపోయింది.

సుగుణశాలినిఅయిన తన కోడలి దురవస్థకు మంగతాయి మనస్సులో చాలా వ్యథ చెందింది. తిన్నగా తన భర్త పూజగదిదగ్గరగా వెళ్లి గోడకు చేరి నిలిచి ఏవో ఆలోచనలు సాగిస్తోంది.

నారాయణదాసు పూజ పూర్తిచేసుకొని వెలుపలకు వచ్చేసరికి, ప్రశాంతమైన అర్ధనిమీలితనేత్రాలు రెండూ మంగతాయిమీద పడ్డాయి.

"ఏం యిలా వచ్చావ్?" అని అడిగాడు.

"రమేశువిషయం ఏం బావుండలేదు"

"ఎందువల్ల"

"కమలతో..." అని చెబుతూ ఆగి "మాట్లాట్టం లేదు." అంది మంగతాయి.

ఇకమించి చెప్పనక్కర్లేకుండానే, పరిస్థితినంతా గ్రహించుకోగలిగాడు. నారాయణదాసు ఆరుమాసాల క్రితం ఈలాంటి మాటే ఓనాడు విన్నాడు. కాని "చిన్నతనం" అనే సమర్థనాఊహవల్ల, మరోనాడైనా దారికి వస్తాడనే నమ్మకంవల్ల నారాయణదాసు ఆనాడేమీ మాట్లాడలేదు. ఆ విషయంగురించి తీవ్రంగా ఆలోచించనూ లేదు. కాని యిప్పుడలా తటస్థంగా ఉండాలన్నా ఉండగల కారణం ఏమీ కనిపించలేదు. ఇప్పటికీకూడా కమలపట్ల రమేశు సుముఖుడుగా లేడని విన్న అతని హృదయం కొంతగా కంపించింది. ఆ భావాన్నిమాత్రం భార్యకి వ్యక్తంచేయకుండా— ప్రశ్నార్థకంగా చూస్తూ—

"ఇక దారిలోకి రాడంటావా?" అన్నాడు.

"అనే యింతకాలం ఊరుకున్నాం" అందామె.

"నిజం" అని వెంటనే సమాధానం యిచ్చాడు. ప్రశాంతమైన అతని మొగంలో అశాంతి ఆక్రమించింది. వెంటనే ఇలా అన్నాడు- "సహించి ఊరుకోగల సావకాశం లేదు" ఈమాట నెమ్మదిగా అందామనే అతని ప్రయత్నం. కాని ఉద్రిక్తంగా ధ్వనించింది.

మంగతాయి భయంగా స్వరాన్ని నెమ్మదిజేసి ముందుకు వంగి "వాణ్ణేంచేద్దామని" అని అడిగింది.

భార్యమనోగతాన్ని తెలుసుకున్న వాడిలా మ్లానంగా ఓమారు నవ్వి—"నాకు తెలుసు. వాణ్ణేం బాధపెట్టను" అని, పట్టుబట్ట మార్చుకోడానికి నారాయణదాసు ప్రక్కగదిలోకి వెళ్లాడు.

సావిట్లో కుర్చీమీద కూర్చొని, పోతనభాగవతాన్ని పఠిస్తోన్న నారాయణదాసుకు కొడుకు గది దాటివెళుతోన్న అడుగులచప్పుడు వినిపించింది. తల పైకెత్తి "రమేశూ" అని పిలిచాడు.

రమేశు తండ్రిదగ్గరగా వచ్చి నిలిచాడు.

"ఎక్కడికి వెళుతోంట?"

"చక్రధరంయింటికి"

"విశ్రమించి పోగల అవకాశంకూడా లేదూ?... ఏమి టాపని" ఆఖరిమాట మొగం చిట్లించి అడగడంలో రమేశు వెంటనే సమాధానం యివ్వగల శక్తిని కోల్పోయాడు. కాని ధైర్యంగానే నిలబడ్డాడు.

"వచ్చినదగ్గర్నుంచి చూస్తున్నా. ఒక్కనిమిషం కూడా ఇంటిదగ్గర గడపడం నీ కంత భారంగావుందేమిట్రా"

ఈమాట విన్నతర్వాత "మీరుచేసిన ఘనకార్యంవల్ల" అని మనస్సులో మాత్రం అనుకోగలిగాడు. కాని పెదాలు మెదపలేదు. మౌనంగానే ఉన్నాడు.

"అలా కూర్చో"

తప్పులెక్కచేసిన బడిపిల్లాడు ఆ తప్పును మాష్టారు గుర్తించేరన్నతర్వాత, ఆయన యివ్వబోయే శిక్ష ఏమో అనే అదురుతో ముందుగా ఆ గురువుగారు చెప్పిన పనల్లా మంత్రముగ్ధుడుగా ఎలా చేయగలుగుతాడో, ఇంచుమించు రమేశుపరిస్థితికూడా అలాగే వుంది. కూర్చోడం మాత్రం తప్పలేదు.

"నువ్వు ఆమెతో మాట్లాట్లేదూ"

"ఎవరితో"—ఏమీ తెలియనివాడిలా ముఖభంగిమమార్చి ప్రశ్నించాడు ! రమేశు.

"ఎవరితోనా—" అని నారాయణదాసు బాధగా నవ్విన మీదట "కమలతో" అని దృఢంగా అన్నాడు.

"కమల చెప్పిందా?"

రమేశుఅన్న ఆమాట విని పుస్తకం హఠాత్తుగా మూసి, తల పైకెత్తి "అభిమానం గల ఏ ఆడదీకూడా నా మొగుడు చూడ్డం లేదని ఆత్మీయులతోకూడా చెప్పుకోలేదురా... చెవిటీ" నారాయణదాసుగొంతు స్ఫుటంతప్పి, ఆబిగ్గరలో వణకడం చూచిన రమేశుకు తండ్రిహృదయవేదన అర్థమైంది. తిరిగి సమాధానం చెప్పడంకూడా భయంగా తోచింది. క్షణంలో తండ్రి కళ్లల్లో నీటితెరలు కనిపించాయి. శుష్కస్వరంతో నారాయణదాసు "ఆమె చాలా యోగ్యురాలురా ! యోగ్యతనేదాన్ని అర్థంచేసుకోలేని పశువుకు కట్టబెట్టాను." అని తలవంచి పుస్తకాన్ని చూస్తూ "ఆ పాపం చుట్టుకొనేది నీక్కాదులే: నాకు" అని పుస్తకం తెరిచాడు. కళ్లు మూడిచాడు. రెండు కన్నీటిచుక్కలు పుస్తకంమీద పడ్డం రమేశు గమనించాడు... ఏదో అనడానికి నోరు తెరిచాడు. వెంటనే నారాయణదాసు "చిన్నతనంలో పెళ్లి చేయడం మాది పొరపాటే ; కాని నువ్వింత పెద్దవాడివయి ఆమెలో లోపాలు ఏం కనిపెట్టావో చెప్పు" అని కుర్చీమీదనుంచి లేచాడు.

రమేశు తలవంచుకొని దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు.

"వస్తుపరిశీలనవిషయంలో, ఒకరు చేసినదానికన్నా మేము ఘనంగా చేసేవాళ్లమని గప్పాలుకొట్టడం దౌర్బల్యహృదయులకు చాలామందికి అలవాటు. కాని ఆబాధ్యతే వాళ్ల నెత్తిమీద పడిందంటే, సున్నమే అన్నంగా భ్రమించి, అనుభవించేటప్పుడు నాలుకకు చుఁక తగిలి అనంతరం సున్నంగా నిర్ధారణ చేసుకోగల తెలివి వాళ్లకుంది" అని గుమ్మంవరకూవెళ్లి వెనక్కితిరిగి "సరే ! నువ్విప్పుడు వెళుతోంది చక్రధరం యింటిక్కదూ ? చక్రధరం నీ స్నేహితుడేగా— ఈ విషయంలో నీహితుడి సలహాకూడా పొందు" అని వెంటనే యింట్లోకి వెళ్లిపోయాడు నారాయణదాసు.

మెత్తనిస్థానాన దిగిన మేకు బలవంతాన తీసివేసినంత తేలికపడింది రమేశహృదయం. కాని గుచ్చుకున్నచోట పొందే సహజమైన బాధ మేకు ఉన్నప్పటికన్నా గిట్టిస్తుంది.

చక్రధరం, పురుషోత్తంఅనే అయిద్దరే స్వగ్రామంలో రమేశుస్నేహితులు. తాను వెళ్లేది పురుషోత్తం యింటికైనా, చెప్పిందిమాత్రం చక్రధరంయింటికని. అందుకు కారణం లేకుండాపోలేదు. పురుషోత్తంలో ఆలోచనాశక్తి మృగ్యమనీ, చక్రధరం మంచి యోచనా ప్రపూర్ణుడనీ నారాయణదాసుకు నమ్మకమనే సంగతి రమేశుకు తెలుసు. చక్రధరంయింటికి తాను వెళ్ళడం అనేది తండ్రిదృష్టిలో తప్పు కాదనే నిజం గ్రహించిన మీదటే అబద్ధాన్నికూడా చెప్పగలిగాడు.

మందగమనంతో తిన్నగా పురుషోత్తంయింటికి బయల్దేరాడు రమేశు.

అసలు పురుషోత్తం ఎవరో చెప్పాల్సిన అవసరం యిక్కడుంది.

రమేశంతోబాటు పురుషోత్తం ఒక్క క్లాసుతప్పకుండా స్కూల్ ఫైనల్ వరకూ వచ్చాడు. స్కూల్ ఫైనల్ పరీక్షల్లోమటుకు పురుషోత్తం పూర్ణానుస్వారాన్ని పొందాడు. చదవగల అవకాశం యింకా ఉన్నా, పురుషోత్తం తల్లి అజ్ఞమాత్రం కాలేదు. ఆమె విధవ. ఇంటిబాధ్యతను నిర్వర్తించగల అవసరం పురుషోత్తంమీద పడింది. ఆ రోజుల్లోనే రమేశం కాలేజీలో కాలుపెట్టాడు.

ఇంతకూ ఆశ్చర్యకరమైన విషయం పురుషోత్తం పెళ్లని రమేశం యిప్పటికీకూడా అనుకుంటూనే ఉంటాడు. రమేశం కలకత్తాలో ఉండగానే పురుషోత్తం పెళ్ళయింది. పెళ్లయినతర్వాత రమేశానికి పురుషోత్తం ఈవిధంగా ఉత్తరం రాశాడు: "మిత్రులను ఆహ్వానించగల అవకాశంకాజేసిన నా పెళ్లి గ్నంగురించి నేను చాలా చింతిస్తున్నాను. శ్రీమతిపేరు లక్ష్మి. చూడ్డానికి నా సుస్వాగతం"

దేనినిగురించి మానవుడు ఎక్కువగా చింతనచేస్తూవుంటాడో, అప్రస్తావన వచ్చేసరికి, శ్రద్ధను ఎవ్వగుణీకృతం చేసి చెవులూ, కళ్లూ వొప్పజెప్పడం సహజం!

ఆ ఉత్తరానికి కళ్లు వప్పజెప్పేవాడే పురుషోత్తంపెళ్లి గురించీ, కట్టుకున్నయిల్లాలిని గురించీ ఊహాచిత్రాలను దృష్టిలో నిర్మించుకొన్నాడు రమేశం.

ఇంతతొందర్లో పెళ్లి కావడానికి ఏదో కారణం ఉండిఉంటుందనీ, ఆలక్ష్మి బహుశా తన భాగ్యకన్న నల్లగా ఉండవచ్చుననీ, లేదా ఎర్రగా బుర్రగా వున్నా, ఏ కాలో కన్నో లొట్టఅయివుంటుందనీ, ఆసంగతి తన మిత్రుడు గుర్తించకుండా కట్నం డబ్బుకోసం కాలుజార్చి ఉంటాడనే నిర్ణయానికి వచ్చాడు.

కాని రమేశం స్వగ్రామం చేరుకున్నతర్వాత పురుషోత్తంయింటికి వెళ్ళి ప్రత్యక్షంగా లక్ష్మిని చూచినమీదట తన నిర్ణయాలన్నీ నిమిత్తమాత్రంగా అయిపోయినాయి. లక్ష్మి సహజలక్ష్మిస్వరూపం. ఆమె చిలిపిచూపులూ, చిరునవ్వుపెదాలూ, శ్వేతవర్ణపు శరీరచ్ఛాయా రమేశాన్ని ఎక్కువగా ఆకర్షించాయి.

వెలుగుముందు చీకటి ఉన్నంత వ్యత్యాసాన్ని లక్ష్మిముఖ్యనూ, కమలముఖ్యనూ సృష్టించుకొన్నాడు రమేశం. మిత్రునితో కాలక్షేపానికన్నా, లక్ష్మిసందర్శనంకోసం రమేశం ప్రతిరోజూ పురుషోత్తంయింటికి హాజరవుతూవుంటాడు.

అలానే ఈవేళకూడా తండ్రి చరచిన హృదయంపై చరుపులనూ, వాటి బాధనూ ఆమెదర్శనమాత్రంగా మరచిపోగలననే నమ్మకంతో పురుషోత్తంయింటికి చేరుకున్నాడు రమేశం.

తనకోసం పురుషోత్తం ఎదురుచూస్తున్నట్లుగా లేదు. వ్యథతో ఉమ్మలుతోన్న మనోబాధను మభ్యపెట్టే ప్రయత్నంలో ఉన్నట్లుగా అతనిపై ఖరి చెబుతోంది. రమేశు వచ్చిన అలికిడి విన్నమీదట తల పైకెత్తి "లేట్ చేశావేం?" అన్నాడు. ఆమాటలో జీవం లేదు. కళ్ళల్లో కాంతీ లేదు. కాని రమేశం అవేమీ గమనించలేదు. పక్కగా ఉన్న ఫ్రేము కుర్చీని లీగ్గా ఎదరకులాగి, దానిమీద బరువుగా కూర్చొని—"మానాన్నగారితో మాట్లాడుతూవుండడం వల్ల ఆలస్యమైంది." అని ముక్తసరిగా సమాధానం

చెప్పి, గదివైపు చూస్తూ "కాసిన్ని మంచినీళ్లు తెప్పించరా భాయి" అన్నాడు.

అలా అడగడం, పురుషోత్తం యింట్లోకి ఆర్డరు చేయడం, లక్ష్మి మంచినీళ్లు తీసుకరావడం, గ్లాసు అందుకుంటూ రమేశం లక్ష్మియొక్క అందాన్ని ఒక్కసారి కళ్లారా పరికించడం ప్రతిరోజూ జరిగేపని. కాని ఆనాడలా జరగలేదు.

పురుషోత్తం సుబ్బమ్మకేసి చూస్తూ "అమ్మా! రమేశానికి మంచినీళ్లు..." అని పిలిచాడు.

రమేశానికి దాహం తగ్గింది. లక్ష్మికి ఆర్డరుచేయకపోడానికి కారణం ఏమిటో వెతకడానికి ప్రారంభించాడు. "వొదినగారికి క్యాజువల్ లీవేమిట్రా" అని అడిగాడు.

రమేశానికన్నా పురుషోత్తం ఒకటిరెండేళ్లు పెద్ద. అంచేత లక్ష్మిని వొదినగారి వరసతో పిలుస్తాడు.

పురుషోత్తంనుండి సమాధానం రాలేదు.

పురుషోత్తంతల్లి సుబ్బమ్మ మంచినీళ్లు తీసుకొచ్చి రమేశానికి అందజేసింది. ఆమెమొగంలో దైన్య రేఖలు కనిపిస్తున్నాయి.

"పిన్నిగారూ, నీరసంగా కనుపిస్తున్నారేం" అని ఎంతో చనువుగా ప్రశ్నించాడు రమేశం.

అడిగినంత త్వరగా ఆమె సమాధానం ఈయలేదు. నెమ్మదిగా గ్లాసు అందుకొంటూ—"కోడలు ఎలావుంది బాబూ" అనిమాత్రం అడిగింది.

అడిగిన మాటకూ, ఇచ్చిన సమాధానానికీ ఆద్యంతంవరకూ ఏమీ సంబంధం లేదు. రమేశం ఆశ్చర్యంగా ఒక్కసారి తల పైకెత్తి, ఆమెఆంతర్యాన్ని గ్రహించినవాడులా పొడిగా నవ్వి "ఎలావుండడమేమిటి, నల్లగావుంది" అని వెంటనే సమాధానం యిచ్చి, తల వంచుకొని "మీకోడల్లామాత్రం లేదు" అన్నాడు. అతని కంఠంలో ప్రస్ఫుటాన్ని సిగ్గుదొంతర్లు కప్పేసినాయి.

ఆమాటలతో పురుషోత్తం హఠాత్తుగా తల పైకెత్తి, అనుమానంగా రమేశంకేసి చూశాడు.

సుబ్బమ్మ గట్టిగా నిట్టూర్చి "మాకోడల్లా ఏ కోడలూ వుండదు... ఉండకూడదని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను" అని ఆమె అక్కణ్నించి వెళ్లిపోయింది.

రమేశం అగమ్యస్థితిలో పడ్డాడు. తానన్న మాట ఆ తల్లీకొడుకులను సంతుష్టిపరచగలదని అతని నమ్మకం. కాని సుబ్బమ్మ అన్నమాటల్లో అర్థమేమిటో రమేశానికి గ్రాహ్యంకాలేదు.

"ఊళ్లో ఏమన్నా పుకారుగా వుందేమిట్రా" అంటూ రహస్యంగా అడిగే భంగిమలో అడిగాడు. ఆపురుషోత్తంకళ్లల్లో నీటితెరలు కనిపిస్తున్నై.

రమేశంమనస్సు కాస్త తటపటాయించింది. ఆశ్చర్యంగా అతనికేసి చూస్తూ "ఏమిటే నువ్వనేది" అన్నాడు.

వెంటనే పురుషోత్తం శుష్కస్వరంతో "కష్టాల్లో స్నేహితుణ్ని గేలిచేయడం ఎవరు నేర్పార్రా" అని అనడంలో పురుషోత్తంకళ్లు రెండూ జలపూరితమయ్యాయి.

రమేశం కుర్చీమీదనుంచి ఎదరకు వంగి అతని చేతులు పట్టుకొని "యథార్థంరా! నాకేం తెలీదు. అదేమిటో నాతో చెప్పవూ" అని ప్రాధేయతగా అడిగాడు.

ఆమాటతో పురుషోత్తం రమేశానికి ఏమీ తెలియలేదనే నిర్ణయానికి వచ్చాడు. జారే కళ్లనీళ్లను తుడుచుకొని "ఇష్టంలేనిభర్తతో కాపురంచేయలేకలక్ష్మి వెళ్లిపోయింది" అని నిరాశగా అరచేతులు ఎదరకు త్రిప్పి, బెంగగా చూస్తున్నాడు.

రమేశం వెంటనే ఏప్రశ్న వేయాలో అతనికి తట్టలేదు. ఆవలించిన నోటితో పురుషోత్తంమొగంకేసి చూస్తూ అలానే ఉండిపోయాడు.

"ఆమె అందకత్తె. నేను కాదనను. కాని ఆ అందం నాచేతిలోపడి మలినం కాక ముందే ఆపని చేయలేక పోయిందీ" పురుషోత్తం అలా చెప్పడంలో రమేశం తేరుకున్నాడు. "ఏంపనీ" అని అడిగాడు.

"ఆ రామారావుతో లేచిపోవడమనే పని"

రమేశంహృదయంలో పిశాచాలు నృత్యంచేస్తున్నై. సున్నితమైన అతని మెదడుపై శూలం తప్ప

కుండా భరతనాట్యం చేసే పాదాలు ఉద్ధృతంగా ఆడుతున్నాయి. ఆత్రంగల కంఠధ్వనితో "పోవడ మెందు కొచ్చిందీ" అని అడిగాడు రమేశం.

ఈసారి పురుషోత్తం కళ్ళనుండి ధారగా ప్రవహిస్తోంది కన్నీరు. రోదనస్వరంతో యిలా అన్నాడు-

"ఆమె ఎప్పుడో రామారావును ప్రేమించిందిట. ఆస్తి లేదని వాళ్ల తల్లిదండ్రులు దాన్నిచ్చి నాకు కట్టబెట్టారట. ఈనాడు కన్ను తెరిచి వాడితో అర్ధరాత్రివేళ లేచిపోయింది" అంటూ వాలు కుర్చీలో హఠాత్తుగా తలను వెనకకు అదుముకొని, కళ్ళను రెండుచేతులతో కప్పుకొని గుడిల్లి చంటిపిల్లాడులా ఏడుస్తున్నాడు.

రమేశానికి ఇంకా నమ్మకం చిక్కలేదు. ఆమె అందాన్ని చూచి ఓర్వలేక ఎవరో ఈ అపవాదును వేశారని అతని అపోహ. ఆసంశయంతోనే "ఇది నమ్మడానికి వీల్లేని మాట; వాడితో పోయినట్లుగా నీ కెవరు చెప్పారు" అని అడిగాడు.

పురుషోత్తం లేచి "రా! లోపలికి" అంటూ రమేశంచేయిపట్టుకొని లోపలకు తీసుకవెళ్లాడు.

తాను కాలేజీలో ఉండగా ఎప్పుడో పురుషోత్తానికి పిచ్చికుక్కకరచిఉండి ఉంటుందనీ, దాని యఫెక్టు హఠాత్తుగా ఈ నాడు వీడికి అంకురించి ఉంటుందనీ ఆలోచిస్తోనే పురుషోత్తం పడకగది చేరుకున్నాడు.

తలదిండుక్రింద జాగర్తపరచిన ఓతెల్లటి చీటీ తీసి పురుషోత్తం రమేశంచేతులో పెట్టాడు. ఆఉత్తరం రమేశంచదివినమీదట - పురుషోత్తానికి పిచ్చిఎక్కలేదనీ, చెప్పే మాటలన్నీ సత్యమనీ నమ్మగలిగాడు.

సుబ్బమ్మకూడా అక్కడికే వచ్చింది. రమేశాన్ని చూస్తూ "అంతా విన్నావుకదూ" అంది.

తలను బరువుగా, క్రిందకు చూస్తూ, వూపాడు.

"నువ్వుకూడా నాబిడ్డలాంటివాడవు కాబట్టి చెబుతున్నా. మావాడి కేం నష్టంలేదు. నాలుగువేల రూపాయలు కట్నంయిచ్చారు. రెండువేలరూపాయల వస్తువులతో పరారయింది. మిగిలింది ఇక రెండువేలు"

ఆమెనిర్భయానికీ, ఆపదలో ఆదాయవ్యయాల సమర్థనకూ రమేశం ఆశ్చర్యపోయాడు. అనుమానంగా ఆమెకేసి చూస్తూ "మరి ఈమచ్చ మాపుకోడం" అని అడిగాడు.

ఆమె ఓమారు ధైర్యంగా నవ్వి "మగవాడికి మనువుజారిందనే మచ్చ పెద్ద లెక్కలోనిది కాదు. ఆసంగతి ఆడవాళ్లవిషయంలో చెప్పు" అంది.

పురుషోత్తంకేసి చూచాడు రమేశం. అంతవరకూ కిటికీలోనుంచి శూన్యంకేసి చూస్తున్న పురుషోత్తం వెంటనే దృష్టిమార్చి "నిజం! మా అమ్మ చెప్పింది ముమ్మాటికీ నిజంరా! నేనకూడా నీలాంటి అదృష్టవంతుడు కావడానికి ప్రయత్నంచేస్తా" అని అక్కడనుంచి నెమ్మదిగా సావిట్లోకి వెళ్ళిపోయాడు.

'అంటే!' అని తనలో తాను తర్కించుకున్నాడు రమేశం. ఆమాటే, ఎదురుగాఉన్న సుబ్బమ్మకేసి చూస్తూ "అంటే" అని అడగలేకుండా వుండలేకపోయాడు.

"కమలలాంటి కోడలిని నేనకూడా పొందిన్నాడు నాజన్మ తరిస్తుంది రమేశూ!...నువ్వు ధన్యుడవుకాబట్టి అలాంటి భార్యను సంపాదించుకోగలిగావు..." అని సుబ్బమ్మ గడిదాటింది. పురుషోత్తాన్ని వీడలేక వీడలేక వీడి రమేశం ఆనాడు యింటికి వెళ్లాడు.

మరునాడు మంగతాయి నారాయణదాసుపూజామందిరందగ్గరకు వచ్చి "కమలమొగం ఈవేళ కళకళ్లాడుతోంది. అబ్బాయినోటంట 'కమలా' అనే పిలుపు రాత్రే విన్నాను." అంది.

వెంటనే నారాయణదాసు అర్ధనిమీలితనేత్రాలతో భార్యకేసి చూస్తూ "ఆత్మసౌందర్యం గల ఆడవాళ్లు భర్తలను ఆకర్షించుకోడంలో ఆలస్యం చేస్తారేమో" అన్నాడు ఆధ్యాత్మిక భావంలో, తృప్తిగా నిట్టూరుస్తూ.